# అసలు విషయం

“ఈ నూటపదహార్లు తీసుకోండి. మమ్మల్ని మళ్లీ భార్యాభర్తలుగ చేశారు. నా భర్త మనస్సు మార్చారు. మీరు చేసిన వుపకారానికి చంద్రుని కో నూలుపోగన్నట్లు, యిది సమర్పించుకొంటున్నాను. నా యావజ్జీవము మీదగ్గర దాసీగా వున్నా మీ ఋణము నేను తీర్చుకోలేను. కృతజ్ఞత వెల్లబుచ్చుకునేందుకు నాదగ్గర మాటలు లేవు. డబ్బు లేదు. అయినా ఒక చిహ్నంగా యిది మీరు స్వీకరించాలని ప్రార్థిస్తున్నాను. మీపాదాలకు వెయ్యిదణ్ణాలు.”

“ఇదేమిటి నాకు దణ్ణాలు పెడతారు? క్షమించండి. నాకేమి తెలియదు. ఈ డబ్బేమిటి? మీ భర్త మనస్సు మార్చుట మేమిటి. మీభర్త యెవరో నాకసలు తెలియందే! నా కేమి అర్థం కావటంలేదు, మీరు చెప్పేది.”

“ప్రాజ్ఞులు చేసిన వుపకారాన్ని గొప్పగా చెప్పుకోరు. మీరూ అంతే. మీ గొప్పతనాన్ని, మీరే చెప్పుకుంటే ఆత్మస్తుతి అవుతుందని వుపేక్షిస్తున్నట్లున్నారు. ఈ మేలును, మా వంశాలతరబడి జ్ఞాపకం వుంచుకుంటాము. ఇది స్వీకరించండి. నన్ను అనుమానించి, నా భర్త నన్ను వదిలేసి నాలుగేళ్లయింది. మళ్లీ నన్ను నా భర్తతో కలిపారు. నాభర్తమనస్సు మార్చారు. ‘ప్రేమ అనే మాటకు అర్థం, తోటిమానవునిమీద చూపవలసిన దయతో కూడిన సౌహార్ద్రతే. అందులో భార్య. నిరపరాధి. అనుమానంతో వృథాగ మనస్సు పాడుచేసుకోకు. నీ జీవితసహచారిణిని వదిలిపెట్టి యేమి బాగుంటావు. వెళ్లు!’ యీ మాటలు మా యావజ్జీవము జ్ఞాపకముంటాయి. ఈ మాటలవలన నా మనస్సు చలించిందని అన్నారు వారు నాతో. మీరు నాకు పతిభిక్ష పెట్టారు. ఇది స్వీకరించండి.”

“మీ పతెవరో నాకు తెలీదమ్మా. మీ రెవరో చెప్పండి. అసలువిషయం చెప్పకుండానే డబ్బు యిస్తా రెందుకు? నేను యేమి చేశానని.”

“మీరు అట్లా అనక అంతా నేనేచేశానని చెపుతారా! మీరు అన్నట్లుగానే, నా నవయవ్వనంలో, నాభర్తతో నా భావి జీవిత ఆశాహర్మ్యాలలో చిలక గోరింకలాగ ఆ సంసారసుఖాన్ని యేడాదిపాటు గడిపా. ఆ చంద్రుణ్ని చూస్తున్నంతసేపు అమావాస్యమాట జ్ఞాపకం వస్తుందా! కాని అమావాస్య రాక మానుతుందా? నా హృదయంలో ఆనాడు అమావాస్యకు చోటు లేకపోయింది. తర్వాత ఆనాడు......ఇక మీకు తెలియని విషయము యేముంది. పూర్వాన్ని స్మరింపచేసి నన్ను కలత పెట్టకండి. ఈనాడు మేము మళ్లీ ఒకళ్లముఖం ఒకళ్లు చూసుకున్నామంటే, మీ దయవల్లనే. ఇది స్వీకరించండి.”

“నాదయ యేమిటి? నేను చేసిం దేముందమ్మా? అసలు విషయం చెప్పండి నాకేమి తెలియదు.”

రచన:
**శ్రీ ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి**

“ఏం చెప్పను, నాయనా. నా మేనత్త కొడుకు రఘు యిక్కడే చదువుకుంటున్నాడు. చిన్నప్పటినుంచి ఒకచోట పుట్టి పెరిగాము కాబట్టి, చొరవగా వున్నమాట నిజమే. నా పెళ్లి అయినతర్వాతకూడ ఆ చనువు చనువుగానే వుంది. మొదటినుంచీ నా పెళ్లి రఘుతోనే అవుతుందని అనుకున్నారు మేనరికం అవటంవలన. అనేక కారణాలవలన అది కాలేదు. తర్వాత నాకు మావారితో పెళ్లిఅయినదగ్గరనుంచి, రఘును నా సోదరునిగా ప్రేమిస్తూ వచ్చాను. అతను అంతే. మీరు చెప్పినట్లుగా నేను యే పాపం యెరుగనండి. చెప్పుడుమాటలవలన జరిగిన పని! పాపం, వారికి అనుమానం లేదు మొదట. మా అన్యోన్యదాంపత్యాన్ని చూసి సంతోషించే ఓర్పుఆ రాజారావుకు లేకపోయింది రాజారావును అన్న పాపం యేమిటి. ఆ విధే మమ్మల్ని చూసి ఓర్చలేకపోయింది. విడదీసింది. మళ్లీ ఆ విధే మీద్వారా కలిపింది మమ్మల్ని. వెయ్యి నమస్కారాలు భగవంతునికి. మీకు కృతజ్ఞత. యిది తీసుకోండి. మమ్మల్ని ఆశీర్వదించండి.”

“ఇదెక్కడి గోలమ్మా? నాకు మీ రెవ్వరో తెలియదు. మీరు చెపుతున్నది అసలు అర్థం కావటంలేదు. నేను విడతీశానా మిమ్మల్ని? మళ్ళీ నేను కలపటానికి!”

“మీరు విడదీయ లేదండీ. మీరు మమ్మల్ని కలిపారు. విడదీసింది ఆ తుచ్ఛమైన రాజారావు అసూయ, ద్వేషము. నా భర్త నన్ను నమ్మలేకపోయారు. చెప్పుడుమాటలకు తల వగ్గారు. పండంటి కాపరం బండలపాలయింది. యీ నాలుగేళ్లు తీరని వ్యధ అనుభవించాను. ఆనాడు సాయంత్రము, వారు రావటం ఆలస్యమైంది. రఘు రోజూకంటె తొందరగా వచ్చాడు ఆనాడు. నా ప్రారబ్ధానికి, మా అమ్మ, నాన్న బజారు కెళ్లారు అప్పుడే. వచ్చీరావటంతోడనే ‘సుజాతా’ అని పిలిచాడు మామూలుగానే. వస్తున్నా అంటూ యింట్లోంచి వచ్చాను. సుజాతా యివ్వాళ ఫ్రుటో తెచ్చాను కాలేజిది అన్నాడు. ఆ ఫొటో దగ్గరపెట్టుకొని నా గదిలో కూర్చున్నాము యిద్దరం. ఫొటో బాగుందా అన్నాడు. ఫొటోకంటే నువ్వే చాల అందంగా వున్నావు అన్నాను. ఫొటో బాగాలేదని చెప్పాలని నా అభిప్రాయము. అయ్యో! నా దురదృష్టానికి వకళ్ళను నిందించి యేమి ప్రయోజనము! అప్పుడే వారింటికి వచ్చారు రాజారావుతో. గది దగ్గరకు వచ్చి...‘నువ్వే చాల అందంగా వున్నావు. ఏం రఘు అంతేనా, యీ మేనరికం యెప్పుడో అవాల్సింది’ అన్నారు. రాజారావు అవునన్నట్లు తల వూపాడు. ఏం చెప్పను బాబు. రఘు కూలపడ్డాడు. నేను అవమానంతో కృశించి కృంగిపోయినా యీ నాలుగేళ్లు. మళ్ళీ మీ దయవలన మాకు మంచి రోజులు వచ్చినాయి. నిజం అద్దం కంటికి కట్టినట్లు చూపించారు నా భర్తకు. బాబు మీ ఋణం మేము యెల్లా తీర్చుకోగలము! ఈ తుఫాను రేగిన

కాశ్మీర్
అన్నిదగ్గులకు అమోఘమైనది
గిరిజా & కో, రాజమండ్రి

సంసారసాగరంలోంచి ఒక దరికి చేర్చారు మీరు. యిది స్వీకరించండి."

"మళ్ళీ మొదలా? నేను మీ భర్తకు చేసిందేముంది? మానవజీవితం అన్న తర్వాత కష్టాలు రాక మానుతాయా? మళ్ళీ మీరు సుఖంగా వుంటున్నా మన్నారు అదే నాకు చాల సంతోషం. నేను చేసిందేమీ లేదు. ఎవరో అనుకుని భ్రమపడుతున్నట్లున్నారు."

"నేను భ్రమపడటం లేదు. మీరు నన్ను భ్రమపడేటట్లు చేస్తున్నారు. నా పతిని మార్చింది మీరు. నా భావి జీవిత ఆశాసౌధాల్లో మళ్ళీ నన్ను నా పతిదగ్గర కూర్చోబెట్టారు. శేఖరంవలన అనుమానం చేత నిప్పులాంటి భార్యను వదిలేసి వ్యర్థమైన జీవితాన్ని గడుపుతున్నావు. కొంతమంది స్నేహితులు యింకొకళ్లు బాగుంటే చూసి ఓర్వలేరు. అలాంటి స్నేహితుడే నీ కొకడు దాపరించాడు. వాడి మాటలు విని నీ పతివ్రతాశిరోమణిని వదలి వచ్చావు. ఆవిడ అక్కడ యెంత కృశిస్తోందో ఆలోచించావా? నిజానిజాలు తెలుసుకున్నావా? ఒక వ్యక్తి ఒక మాట చెప్పినంతమాత్రాన నువ్వు నమ్మి, యావజ్జీవము నీ సేవకై ఉర్రూతలూగుచున్న భార్యను వదిలేసి, మానవజీవితంలో ఒక వ్యక్తికి యింకొక వ్యక్తి చూపించవలసిన దయ, క్షమా, ప్రేమ, సౌహార్ద్రత, మొదలనే త్రుంచివేశావు. చనువుగా బావతో అన్న మాటలకు పెడఅర్థం కల్పించావు. సావిత్రి నిరపరాధి. ఆవిడ నీకోసం అహోరాత్రాలు కన్నీరు మున్నీరుగా తపస్సు చేస్తోంది. నీతోడిదే ఆవిడ జీవితం. ఆవిడ లేనిదే నీవు బ్రతకగలవని బైటకు వచ్చావు. నీ మనస్సుమాత్రం శాంతిగా వుందా? నీకుమాత్రం సుఖం వుందా? ఒక జీవిని కష్టపెట్టి, నువ్వూ కష్టాలను అనుభవించటంలో ఆంతర్యమేమిటి? ఆవిడ ప్రేమరాశి. పురాకృత సుకృతంవలన లభ్యంఅయ్యే అలాంటి పతివ్రతాశిరోమణులకోసం అనేకమంది కలలు కంటూ వుంటే, అనాయాచితంగా అలాంటిది, నీకు అర్థాంగి అయ్యే అదృష్టము పట్టితే, చిల్లిగవ్వకుకూడ కొరమాలినదానినిగా నీవు నిరాకరించావు. త్వరపడుము త్వరపడుము. నీకోసం పరితపిస్తున్న ఆ సౌందర్యరాశి యింకా యెక్కువకాలము యీ యెడబాటును సహించలేదు. క్షణం ఆలస్యమైతే మళ్లీ ఆ శరీరంతో నిన్ను కలుసుకోదు. శాశ్వతమైన అమరపురిలో నీకూ ఒక స్థానము యేర్పాటు చేస్తుందిలే' యీ మాటలు వారి మనస్సును కలవరపరిచినాయట. ఇక్కడ జరిగినట్టే నిజంగా చచ్చిపోదుగదా అనుకుంటూ అమిత ఆవేశంతో సుజాత సుజాత అని పిలుచుకుంటూ నా దగ్గరకు వచ్చారట. 'సుజాత' అనే వక్క పిలుపులో నా భగ్న జీవితంలో ఓ వెలుగును చూశాను. మబ్బులు విచ్చినాయి. మళ్ళీ చంద్రుడు కనిపించాడు. ఆయన బాహువుల్లోకి చేరాను. అమరసుఖాన్ని అనుభవిస్తున్నాను. ఇంత మార్పుకు కారణం నేను అడగకుండానే యీ కథంతా చెప్పారు. పిచ్చెక్కినవాళ్లమాదిరిగా మిమ్మల్ని వెతుక్కుంటూ తలోదిక్కు పోయినాము. ఇది స్వీకరించండి. మమ్మల్ని ఆశీర్వదించండి.... అరుగో వారు వస్తున్నారు."

"అయ్యో! రక్షించండి... !!"

"ఏమిటిరా వాసు యీయన యెవరు, యీ అమ్మ యెవరు?...అరె!...ఎందుకు కన్నీరు...ఏమిట్రా అసలు విషయం?..."

"ఆనందభాష్పాలు...వీళ్లిద్దరు భార్యాభర్తలు. ఇప్పుడు యీవిడ పలికిన మాటలు నేను 'అనుమానము' అనే శీర్షిక క్రింద వ్రాసిన కథలోనివి. ఆ కథ వీళ్ల జీవితానికి సరిపోయింది. నా కథలో సావిత్రే, యీ సుజాత. నా కథలో వెంకట్రావే, యీమె భర్త.........సావిత్రి చచ్చిపోయినట్టు వ్రాశాను. నన్ను క్షమించండి......!!"

"ఆ......!!!"

★

---

ఒక సినిమా తారని ఒక కోటీశ్వరుడు పెళ్లి చేసుకో గోరి, ఆమె ప్రవర్తన ఎలాంటిదో కనిపెట్టడానికి డిటెక్టివ్‌ని నియమించాడు. కొద్ది రోజుల తర్వాత డిటెక్టివ్ ఇలా ఉత్తరం వ్రాశాడు:

"ఆవిడ ప్రవర్తనని అంతా మెచ్చుకుంటున్నారు. ఆవిడ గత చరిత్ర నిష్కళంకమైనదట. ఈ మధ్యమాత్రం దుశ్శీలుడైన ఒక కోటీశ్వరుడితో ఆమె తరుచు కనిపిస్తున్నదని గుసగుసలు వినిపిస్తున్నాయి."

*          *          *          *

కూతురు — అమ్మా! అక్కయ్యవి పిల్లికళ్లేవుండే. చీకట్లో కూడా బలేగా చూడగలదు.

అమ్మ — ఏం? ఎందుకని?

కూతురు — నిన్నరాత్రి నేనూ అక్కయ్యా, బావా డాబ్లో కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నాం. కటికచీకటిగా వుంది అంతా. అక్కయ్యకి ఎల్లా కనిపించిందో మరి, "ఏమండీ! ఇవ్వాళ మీరు గడ్డం గీసుకోలేదేం?" అని అడిగింది. విచిత్రంగాలేదూ!